# పుట్టినరోజు

పాలపర్తి జ్యోతిష్మతి

'రేపు నాపుట్టిన రోజు. నాకు బహుమతి ఇవ్వరా?' గోముగా సుబ్బారావుని అడిగింది సుబ్బలక్ష్మి.

'నువ్వట్లా అడగాలా సుబ్బూ! ఏం కావాలో చెప్పు. ఓ వెయ్యి రూపాయలు పెట్టి మంచి చీర తేనా?'

'అబ్బ! చీరల మీద నాకు మోజు లేదు. అయినా రేపు కట్టుకోడానికి కొత్త చీర ఉంది. ఇంక చరలేం వద్దు. నాకొక వస్తువు కావాలి, కొంటారా?'

'నువ్వడగడమూ, నేను కాదనడం కూడానా? తప్పకుండా కొంటాను. ఏంటా వస్తువు?'

'అడిగిన తరువాత కాదనకూడదు.'

'ఈ సుబ్బారావు ఆడిన మాట తప్పేవాడు కాదు.'

'నా కొక సెల్‌ఫోన్ కొని పెట్టండి.'

'సె...ల్... ఫోనా!' ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు.

'ఎందుకంత ఆశ్చర్యపోతారు?'

'ఇంట్లో ల్యాండ్‌ఫోన్ ఉంది నా దగ్గర ఒక సెల్‌ఫోన్ ఉంది. ఇంకొకటి అవసరమా అని.'

'అవసరమా, కాదా అని కాదు. ఈ పక్కింటి ఆండాళ్ళు దగ్గర సెల్ ఉంది, ఆ పక్కింటి దాక్షాయణి దగ్గర ఉంది, ఎదురింటి లలిత దగ్గర ఉంది, ఆఖరికి మీ స్నేహితుడు రామారావు భార్య దగ్గర కూడా ఉంది. అందుకే నాక్కూడా ఒక సెల్ ఉంటే బాగుంటుం దనిపించింది.'

"రామారావు భార్య దగ్గర కూడా అంటే నీ ఉద్దేశం ఏమిటి?"

"ఏదో మాటవరసకన్నాను లెండి. మాట మార్చకుండా కొనరా చెప్పండి".

"అది కాదు సుబ్బూ..."

"అవున్లెండి, నేనేమైనా ఉద్యోగం చేస్తున్నానా? సంపాదిస్తున్నానా? నాకెందుకు సెల్‌ఫోన్?' ముక్కు ఎగపీల్చి కళ్ళొత్తుకుంది సుబ్బలక్ష్మి.

'అయ్యో! అట్లా బాధపడకు సుబ్బూ! నువ్వు నోరు తెరిచి అడిగాక కాదనడం నాదే తప్పు. ఇప్పుడే వెళ్లి తీసుకొస్తాం. ఒరే చింటూ! రా, రా. బజారుకెళ్లి అమ్మకి సెల్‌ఫోన్ కొనుక్కొద్దాం'.

అప్పటివరకూ వాళ్ళ మాటలు వింటూ టీవీ చూస్తున్న చింటూ చెంగున సోఫాలోంచి కిందకి దూకి సుబ్బలక్ష్మి దగ్గరికొచ్చి 'మాంచి ఫస్ట్ క్లాసైన మోడల్ సెలక్ట్ చేసి తీసుకొస్తాను చూడు' అన్నాడు.

'పోనీ నువ్వు కూడా రాకూడదూ! నీకు నచ్చింది నువ్వే కొనుక్కుందువుగాని' అన్నాడు సుబ్బారావు.

'నేను వంట చెయ్యాలి. ఆలస్యమైతే చింటూ నిద్ర కాగలేదు. మీరెళ్లి తీసుకురండి. మీరేది తెచ్చినా నాకు నచ్చుతుంది'. మురిపెంగా అంది సుబ్బలక్ష్మి.

చింటూ తన చేతిలో పెట్టిన సెల్‌ఫోన్ చూడగానే సుబ్బలక్ష్మి 'చాలా ఖరీదుంటుందేమో' అంది.

'డబ్బెంతైతేనేం సుబ్బూ! నాక్కావల్సింది నువ్వు సంతోషంగా ఉండడం' అంటున్న భర్త వైపు మెచ్చుకోలుగా చూసింది సుబ్బలక్ష్మి. చింటూ దాన్ని ఎట్లా ఉపయోగించాలో వివరించాడు. వెంటనే తన తమ్ముడికీ, అమ్మానాన్నలకు, ముఖ్యమైన స్నేహితులు కొందరికి ఫోన్ చేసి తన కొత్త నంబరు ఇచ్చింది.

మర్నాడు పొద్దున్నే అందరి దగ్గరి నుంచి జన్మదిన శుభాకాంక్షలు కొత్త సెల్‌ఫోన్ ద్వారా అందుతుంటే ఇల్లంతా తిరుగుతూ ఫోన్‌లో మాట్లాడుతూ సందడి చేసింది సుబ్బలక్ష్మి.

సుబ్బారావు ఆఫీసుకూ, చింటూ బడికీ వెళ్లగానే హాల్లో బల్లమీద సెల్‌పెట్టేసి వంటగదిలో కెళ్ళి పనిలోపడింది.

సెల్‌ఫోన్ మోగడంతో 'రావలసిన వాళ్ళందరి దగ్గరి నించీ ఫోన్లు వచ్చేశాయి కదా! ఇప్పుడెవరో! అనుకుంటూ గబగబా వచ్చిఫోన్ ఎత్తింది. అవతల నించి ఒకమ్మాయి మాట్లాడ్డం మొదలుపెట్టింది. 'చాలా మంది నన్నడుగుతున్నారు 'మీ నంబర్ నాకిస్తారా? నేను మీకు ఫోన్ చెయ్యవచ్చా?' అని. 'ఎందుకబ్బా' అనుకుంటున్నారా? నా హలో ట్యూన్ వినడానికి. మీరు కూడా మీ మొబైల్‌లోనా హలో ట్యూన్ పెట్టుకోవాలనుకుంటున్నారా? అయితే కాల్ చెయ్యండి 12345 నంబరుకు మరియు చెప్పండి 'హలోట్యూన్' అని.'

'ఏయ్ అమ్మాయ్! నీకేం పని లేకపోతే ఇంకెవరికీ పనులుండవనుకుంటున్నావా? నాకే ట్యూన్లు అక్కర్లేదు. ఇంకెప్పుడూ ఇట్లా ఫోన్ చేసి విసిగించకు' అని చెప్పి ఫోన్ పెట్టేసింది.

మళ్ళీ కాసేపటికి ఫోన్ మోగింది. సుబ్బలక్ష్మి ఫోన్ ఎత్తి కాస్త విసుగ్గా హల్లో అంది.

'హాయ్! అయామ్ స్నేహ. మీరు మీ జీవిత సహచరి కోసం వెతుకుతున్నట్లైతే కాల్ వి 1234567890'

'ఎవత్తెవే నువ్వు? ఒకసారి 'ఇంక ఫోన్ చెయ్యకు' అని చెప్తే అర్థం కాదా? ఒక ఆడదాన్ని 'జీవిత సహచరి కోసం వెతుకుతున్నారా?' అని అడుగు తున్నావు. నీకేమైనా పిచ్చా? ఇంకోసారి తిక్కతిక్కగా మాట్లాడావంటే నాలుక్కోసేస్తాను జాగ్రత్త' గట్టిగా అరిచి విసురుగా వంటింట్లోకెళ్ళింది సుబ్బలక్ష్మి.

ఇంకా సేపటికి మళ్ళీ ఫోన్ మోగింది. కోపంతో ఊగిపోతూ బయటికొచ్చి ఫోనెత్తింది సుబ్బలక్ష్మి.

'హల్లో.... ! మీరు లవ్‌లో పడ్డారా? మీ మనసులో మాట మీ లవర్‌కి ఎట్లా చెప్పాలా అని ఆలోచిస్తున్నారా?....'

'ఎంత ధైర్యమే నీకు! ఈ సుబ్బలక్ష్మినే 'లవ్‌లో పడ్డారా?' అని అడుగుతావా? అవునే ! నేను ప్రేమిస్తున్నాను. మా ఆయన్ని ప్రేమిస్తున్నాను, అమ్మా నాన్నల్ని, తమ్ముణ్ణి ప్రేమిస్తున్నాను. ఇంకా ఈ ప్రపంచంలో అందర్నీ ప్రేమిస్తున్నాను, ఒక్క నిన్ను తప్ప. చాలా?' అంటూ సెల్‌ఫోన్ సోఫాలోకి గిరాటేసి మళ్ళీ వంట పనిలోకి దూకింది సుబ్బలక్ష్మి దాని జోలికి పోకుండా పనంతా పూర్తిచేసుకుని సెల్‌ఫోన్ సోఫాలోకి గిరాటేసి మళ్ళీ వంటపని లోకి దూకింది సుబ్బలక్ష్మి.

హాల్లో సెల్‌ఫోన్ అరగంట కొకసారి నా మొర వినమంటూ మొత్తుకుంటోంది. సుబ్బలక్ష్మి దాని జోలికి పోకుండా పనంతా పూర్తిచేసుకుని సెల్‌ఫోన్ శబ్దం గట్టిగా వినిపించకుండా దాన్ని దిండు కింద దాచి ఒక కునుకేసింది. సుబ్బారావూ, చింటూ వచ్చే సమయానికి లేచి భోజనం వడ్డించి ఎదురు చూస్తూ కూర్చుంది.

సుబ్బారావు ఇంట్లోకి వచ్చే సమయానికి దిండు కింద సెల్‌ఫోన్ సన్నగా మూలుగుతోంది. సుబ్బలక్ష్మి నిర్వికారంగా టీవీ చూస్తూ కూర్చుంది.

'ఏంటి సుబ్బూ పొద్దున్నించీ ఫోన్ చేస్తుంటే ఎత్తట్లేదు?' కంగారుగా అడిగాడు సుబ్బారావు.

'పొద్దున్నించీ అదెవత్తో ఫోన్ చేసి తెగ విసిగిస్తోంది. మీరసలు నా నంబరు దాని కెందు కిచ్చారు?' సుబ్బారావు మీద గయ్‌మని లేచింది సుబ్బలక్ష్మి.

'నీ నంబరు నేనెవరికిచ్చాను సుబ్బూ? నువ్వే కదా నిన్న రాత్రి ఎవరెవరికో ఫోన్ చేసి 'కొత్త సెల్‌ఫోన్ కొనుక్కున్నా' నని చెప్పావు? అసలెవరా అమ్మాయి?' అన్నాడు సుబ్బారావు బిక్క చచ్చిపోయి.

'ఏమో! ఎవత్తో! ఒకసారి ఫోన్‌చేసి 'హలో ట్యూన్ కావాలా' అంటుంది. ఇంకోసారి సిగ్గులేకుండా 'పెళ్ళి చేసుకుందామా?' అని అడిగింది. చివాట్లు పెట్టినా బుద్ధి రాలేదట్టుంది. మళ్ళీ ఫోన్ చేసి 'లవ్‌లో పడ్డారా?' అంటోంది. అసలు దానికి నా నంబరు ఎట్లా తెలిసింది?"

సుబ్బారావు, చింటూ గట్టిగా నవ్వారు.

"ఎందుకా నవ్వు?" ఉక్రోషంగా అడిగింది సుబ్బలక్ష్మి.

"అవి ఎవరో అమ్మాయి చేస్తున్న ఫోన్లు కావు సుబ్బూ! ప్రి రికార్డెడ్ మెసేజెస్ అంటారు వాటిని. నెట్‌వర్క్‌లో ఉన్న నంబర్లన్నిటికీ కంప్యూటర్ ద్వారా కాల్స్ వెళుతూ ఉంటాయి. నువ్వు తిట్టినా వినడానికి అక్కడ ఎవరూ ఉండరు. ఫోన్ ఎత్తి హలో అనగానే అవతలి నించి వినిపించే దాన్ని బట్టి మనకర్థమై పోతుంది అది మనకవసర మైన ఫోనా కాదా అని. వెంటనే కట్ చేసేస్తే సరిపోతుంది." వివరించాడు సుబ్బారావు.

"సరేలెండి, వంటింట్లోంచి పరుగెత్తుకుంటూ వచ్చి ఫోన్ మాట్లాడి వెళ్ళేటప్పటికీ పొయ్యిమీద పాయసం కాస్తా మాడిపోయింది. బోలెడు పాలు, పంచదార వృధా అయిపోయాయి. అదంతా అవతల పారేసి మళ్ళీ రవ్వకేసరి చేశాను. రెట్టింపు పనయ్యింది."

"నాకు పాయసం ఇష్టముండదనీ తెలిసీ నువ్వు అదే చెయ్యాలనుకున్నావు. అందుకే దేవుడు అట్లా చేశాడు" ఆనందంగా రవ్వకేసరి తింటూ అన్నాడు చింటూ.

"దేవుడు కాదు, సెల్‌ఫోన్ మహాతల్లి" అక్కసుగా అంది సుబ్బలక్ష్మి.

"కొన్ని సౌకర్యాలు కావాలనుకున్నప్పుడు కొన్ని అసౌకర్యాలు భరించక తప్పదు" అన్నాడు సుబ్బారావు.

"బాగానే ఉంది, వెధవ సంత! కోరి కోరి నెత్తికెక్కించుకున్నాను" అసహనంగా గొణుక్కుంది సుబ్బలక్ష్మి.






సతీ! నీకు నమస్కృతి

రచయిత :
ఆర్.కె.కటారి

వెల : రు.50/-

ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
నవోదయ పబ్లిషర్స్
నవోదయ బుక్ హౌస్
దిశ పుస్తకకేంద్రం
ప్రజాశక్తి బుక్ హౌస్

ఇది చినుకు ప్రచురణ




180 పేజీలు
వెల : రు॥125 /-లు

డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

"విమర్శ-2009"

2009లో దిన, వార, పక్ష, మాస పత్రికలలో వచ్చిన విమర్శపై మూల్యాంకనం.

ఈ పుస్తకం కావలసినవారు రు॥ 80/-లు ఎం.ఓ.ద్వారా పంపించగలరు. పోస్టేజి ఉచితం.

మేనేజర్, చినుకు ప్రచురణలు, దత్తాస్ నయాబజార్, రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ - 520 003.
ఫోన్ 0866-6640595, సెల్ : 98481 32208